


మహబూబ్‌నగర్

వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# నీటి ఎద్దడి నివారణకు చర్యలు

**మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**విసి ద్వారా శానిటేషన్ కమిటీ సమావేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** వచ్చే మే నెలలో ఎండలు తీవ్రరూపం దాల్చనున్న నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కావలసిన అన్ని ముందస్తు చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు గ్రామపంచాయతీ కార్యదర్శులతో మండల స్థాయిలో తరచూ సమావేశాలు నిర్వహించి నీటి సరఫరా సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా ఉన్నప్పటికీ, టెయిల్ ఎండ్ గ్రామాలు, ఎత్తైన ప్రాంతాల్లోని తండాలు/హాబిటేషన్లలో నీటి కొరత ఉందని గుర్తించిన కలెక్టర్, అటువంటి ప్రాంతాలను



మాట్లాడుతున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

గుర్తించి అవసరమైతే కొత్త బోర్లు తవ్వడం, పనిచేయని బోర్లను మరమ్మతు చేయడం, ఫ్లషింగ్ చేయడం వంటి చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. నీటి వనరులు లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి – మిగతా4లో..



నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

## సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ

# నిర్మాణ పనులపై సమీక్ష

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు మరియు 167కే జాతీయ రహదారి భూసేకరణ పనులను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ భూ సేకరణ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రాజెక్టుల భూసేకరణ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ నీటిపారుదల జాతీయ రహదారి శాఖల భూసేకరణ నిర్మాణా పనుల తీరును సమగ్రంగా సమీక్షించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బాలెన్సింగ్ రిజర్వాయర్, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణ పనులు, భూసేకరణ, పరిహారం చెల్లింపులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టుల పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని, ముఖ్యంగా భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సముచిత పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా గుండా ప్రయాణించే 167కే జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులు కూడా ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు తమ తమ విభాగాల పురోగతిపై నివేదికలు సమర్పించగా, పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు. ప్రజల సమస్యలకు వెంటనే స్పందిస్తూ పారదర్శక పాలనను అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవోలు, రెవెన్యూ, ఇరిగేషన్, భూసేకరణ అధికారులు, రహదారి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్పీ డా.వినీత్

## డ్రగ్స్ నిర్మూలన

# ప్రతీ ఒక్కరి బాధ్యత

**నారాయణపేట జిల్లా ఎస్పీ డా.వినీత్**

**నారాయణపేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు బాలల, మహిళల భద్రత, డ్రగ్స్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత క్రమశిక్షణతో నడుచుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, దేశ భవిష్యత్‌ను నిర్ణయించే నేటి యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా.వినీత్ సూచించారు. మహిళలు, బాలికల భద్రతతో పాటు డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సంపత్ కుమార్‌సింగ్ – మిగతా4లో..

# 96.61

## ఉత్తీర్ణతా శాతం

- పదో తరగతి ఫలితాల్లో బాలికలదే చేయి
- రాష్ట్రంలో రెండో స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా
- 99.03 ఉత్తీరణతా శాతంలో ఆల్‌టైం రికార్డు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్ష ఫలితాలలో బాలికలపై చేయి కనిపించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాగర్ కర్నూల్ మొదటి స్థానంలో నిలువగా నారాయణపేట రెండో స్థానంలో వనపర్తి జిల్లా మూడోస్థానంలో మహబూబ్‌నగర్ నాలుగు స్థానంలో జోగులాంబ గద్వాల జిల్లా ఐదో స్థానంలో నిలిచాయి. రాష్ట్రంలోనే నాగర్‌కర్నూల్ జిల్లా రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. మహబూబ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను వారి తల్లిదండ్రులతో కలిసి ప్రశంసించి అభినందించారు.




ఉమ్మడి జిల్లా వారీగా ఉత్తీర్ణత పొందిన వారి సంఖ్య

| జిల్లా | బాలురు | బాలికలు | మొత్తం | ఉత్తీర్ణత |
|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 6157 | 6325 | 12482 | 94.57 |
| నాగర్‌కర్నూల్ | 5192 | 5346 | 10538 | 99.03 |
| నారాయణపేట | 3860 | 4265 | 8125 | 97.82 |
| వనపర్తి | 3462 | 3565 | 7027 | 97.46 |
| జోగులాంబ గద్వాల | 3548 | 4001 | 7549 | 93.93 |

## రాష్ట్రంలో నాగర్ కర్నూల్

# రెండో స్థానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాగర్కర్నూల్ జిల్లా రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచింది.మొత్తం 10641మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10538 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు. ఓవరాల్‌గా 99.03పాస్ పర్సంటేజీతో రాష్ట్రంలో రెండో స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది. 5192 మంది బాలురు 5346 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా, 99.31 ఉత్తీర్ణత శాతంతో బాలికలు పై చేయి అందుకున్నారు. ఇదిలా ఉండగారాష్ట్రంలో 14వ స్థానంలో నారాయణపేట జిల్లా, 19వ స్థానంలో వనపర్తి జిల్లా, 26వ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, 29వస్థానంలో జోగులాంబ గద్వాలజిల్లా నిలిచాయి.



## ప్రజల సాకారంతోనే

# గ్రామాలు మరింత అభివృద్ధి

- చిట్యాల, గజరందొడ్డి గ్రామాల మధ్య పెద్ద వాగుపై రూ.20కోట్లతో వంతెన, చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన
- మక్తల్‌లో 220 కేవీ సబ్ స్టేషన్‌నుకు భూమి పూజ
- బ్రిడ్జి నిర్మాణంతో దాదాపు 20 గ్రామ ప్రజలకు మేలు
- పదవులు శాశ్వతం కాదు మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతం
- రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలో మంత్రి పర్యటన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో అవిశ్రాంతంగా కొనసాగింది. మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మీ అందరి సహకారం ఉంటే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. గ్రామాల్లో ప్రజలు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలు, రాష్ట్రాలు తద్వారా దేశం బాగుపడుతుందని గ్రామాలను బాగు చేసుకున్నప్పుడే మనం తెలివి మంతులమవుతామని హితవు పలికారు. గ్రామాల్లో అంతర్భాగ డ్రైనేజీలు రోడ్లు పెద్దగా ఉంటేనే గ్రామాలకు గౌరవం పెరుగుతుందన్నారు. రోడ్ల విస్తరణలో తన సొంత ఇల్లు అడ్డం వచ్చినా తొలగించాలని పేదవాళ్ల ఇండ్లు కోల్పోతే వారికి ఇండ్లు మంజూరు చేస్తామని హామీ నిచ్చారు. సాగునీటి ప్రాజెక్టులకు కావాల్సిన విద్యుత్ సమస్య లేకుండా మక్తల్‌కు 220 కేవీ సబ్ స్టేషన్‌ను త్వరలో తీసుకొస్తామని వెల్లడించారు. మొదటగా మక్తల్ పట్టణంలోని పంచాయితీ రాజ్ కార్యాలయంలో నూతనంగా నిర్మించబోయే సబ్ డివిజన్ భవన నిర్మాణానికి రాష్ట్ర క్రీడ పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంఖుస్థాపన చేశారు. అనంతరం మక్తల్ మండలం చిట్యాల, గజరందొడ్డి గ్రామాల మధ్య పెద్ద వాగుపై 20 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన వంతెన, చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇక్కడ ఉండే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ వంతెన అనివార్యమన్నారు. ఈ బ్రిడ్జితో దాదాపు 20 గ్రామాల ప్రజలకు మేలు చేకూరుతుందని తెలిపారు.



రూ. 20 కోట్లవ్యయంతో గొల్లపల్లి మంతన్ గౌడ్ గ్రామ వంతెన నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

ఇక్కడ వంతెనను నిర్మించడం నాబాధ్యతని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు సాగు నీరు అందించే లక్ష్యం తూగో బ్యారేజికం బ్రిడ్జి నిర్మాణన్ని చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. వ్యవసాయం చేసి మన ప్రాంత రైతాంగం ఆర్థికంగా ఎదగాలన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్య మంత్రులతో మాట్లాడి రూ. 710 కోట్లతో కొల్చూర్ వద్ద మిని జూరాల ప్రాజెక్ట్ కు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇక్కడి ప్రాంతాల సమస్యలు ప్రతీది తెలుసని తెలిపారు. సమస్యలను పారద్రోలి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చారు. మక్తల్‌లో ఇప్పటికే 150 పడకల ఆసుపత్రి, డిగ్రీ కాలేజీ, కోర్టు, మక్తల్ నారాయణపేట నాలుగు లేన్‌ల రహదారి విస్తరణ, మక్తల్ స్టేడియం లాంటి అభివృద్ధి పనులకు దాదాపు 1000 కోట్లు తెచ్చామని గుర్తు చేశారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలియజేశారు. ఎన్నికల వరకే రాజకీయాలని ఎన్నికల తర్వాత మనందరి చూపు అభివృద్ధి పైనే ఉండాలన్నారు. అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. వారు అభివృద్ధికి సహకరించకపోగా తనపై విమర్శలు చేస్తున్నారని మండి పడ్డారు.తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని మంత్రి శ్రీహరి తెగేసి చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికీ డబల్ బెడ్రూమ్ లు రాలేదని ఇప్పుడు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు.ఆతర్వాత మధ్యాహ్నం మక్తల్ మండలం అనుగొండ ఆర్ అండ్ ఆర్ సెంటర్ ను రాష్ట్ర క్రీడా,పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించారు. ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లో వాటర్ ట్యాంక్ హెడ్ నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేసి అనుగొండ ముంపు గ్రామాన్ని కొత్త గ్రామంగా చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముంపు గ్రామంలోని వేల మందిని – మిగతా4లో..

# శతశాతం విద్యార్థులే టాపర్లు


- పదవ తరగతి ఫలితాలు స్ఫూర్తిదాయకం
- 17మండలాల్లో 14 మండలాల్లో వారే ముందంజ
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి
- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** పదవ తరగతి ఫలితాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఐఐటీ లక్ష్యంగా మహబూబ్ నగర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొన్న 150 మంది విద్యార్థుల్లో 40 మంది విద్యార్థులు 530ఆపై మార్కులు సాధించారు. వారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలోని శతశాతం పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 17 మండలాల్లో 14 మండలాల్లో శతశాతం పాఠశాలల విద్యార్థులే టాపర్లుగా మార్కులు సాధించడం వెనుక గురువుల కృషి,తల్లిదండ్రుల సహకారం, సమాజం భాగస్వామ్యం ఉందన్నారు. మహబూబ్ నగర్ జిల్లా విద్యార్థులు ప్రతిభావంతులని, సరైన మార్గదర్శకత్వం అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలలో కూడా మంచి ఫలితాలు సాధించగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మార్కులు మాత్రమే విజయానికి ప్రమాణం కాదని, లక్ష్యంతో కష్టపడి ముందుకు సాగితేనే నిజమైన విజయం సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు నేను సాధించగలను" అనే ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. చదువే జీవితాన్ని మార్చే




విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

ప్రధాన సాధనమని, చదువుతోనే కుటుంబానికి గౌరవం, స్థిరమైన భవిష్యత్తు లభిస్తుందని తెలిపారు. వచ్చే 4-5 సంవత్సరాలు పూర్తిగా చదువుపైనే దృష్టి పెట్టాలని, మొబైల్ ఫోన్లు, సినిమాలు వంటి దారి తప్పించే అంశాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో నిర్వహించిన శతశాతం శిక్షణా శిబిరాలు, కోచింగ్ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయని, అందులో పాల్గొన్న గురువులు, అధికారులు, సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో 8వ,9వ,10వ తరగతులకు కూడా శతశాతం కార్యక్రమం విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక గ్రామం మొత్తం కలిసి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా – మిగతా4లో..



# వరి,మొక్కజొన్న కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలి

- కొనుగోలు చేసిన మొక్కజొన్న భద్రతపై ప్రత్యేక దృష్టి
- రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- పంట కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్


**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న యాసంగి వరి కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సివిల్ సప్లై అధికారులతో పాటు మిల్లర్లతో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకనుగుణంగా వెంటనే కొనుగోలు చేసి, ఎటువంటి ఆలస్యం లేకుండా ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనుగోలు చేసిన మొక్కజొన్నను సురక్షితంగా నిల్వ చేయడం అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం మిల్లర్లు తమ పరిధిలో ఉన్న



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

గిడ్డంగులు లేదా ఖాళీ స్థలాలను నిల్వకు అనువుగా అందుబాటులో ఉంచాలని సూచించారు. నిల్వ సమయంలో తేమ, వర్షం వంటి కారణాల వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన కవర్లు, తార్పాలిన్‌లు మరియు భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేసిన పంటను వెంటనే తరలింపు చేసి, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద పంట ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, రవాణా ఏర్పాట్లు వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు. రైతుల పంటకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రతి దశలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు, గన్నీ సంచులు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో తేమ శాతం, బరువు కొలతలు, నాణ్యత పరీక్షల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల నుంచి ధాన్యం స్వీకరించిన వెంటనే రికార్డులు నమోదు చేసి, చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రైతులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించి, వారికి ఎటువంటి నష్టం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా అక్రమాలు గుర్తించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షంతోనే ప్రజల సమస్యలు పరిష్కారం

**బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్**

**వనపర్తి రూరల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** సమర్థవంతమైన ప్రతిపక్షంతోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ మున్సిపల్‌చైర్మన్ బిఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం బిఆర్ఎస్ కౌన్సిలర్లు,సిపిఎంకౌన్సిలర్లతో మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గట్టు యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు గురువారం మున్సిపల్ సమావేశంలో జరగబోయే ఏజెండా అంశాలు వివరించి, పట్టణంలో నెలకొని ఉన్న ప్రధాన సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశములో కౌన్సిలర్స్ మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, గంధం మదన్, భారతీ ప్రేమ్ నాథ్ రెడ్డి, ఏర్వ అరుణ శ్రీనివాసులు,స్వాతి హరిబాబు, శంకరమ్మ బాబు నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

## రైతుల ముంగిటకు వ్యవసాయ శాస్త్రవేత్తలు

**చిన్నచింతకుంట,ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో రైతులకు మేళకువలను వివరించేందుకు పర్దిపూర్ గ్రామంలో రైతుల ముంగిటకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.అర్చన, కె.కళ్యాణిలు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులను తగ్గించి పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువులు,పశువుల పేడ, కోళ్ల పెంట, గొర్రెల, వానపాముల ఎరువులను వాడి భూసారన్ని పెంచుకోవాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్నగింజ, దొడ్డి గింజ రకాలను సాగు చేసుకోవాలన్నారు. రైతులు పంట మార్పిడి చేసుకోవడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక నివేదికను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. పంటల్లో వచ్చే చీడపీడలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు సూచించాలని గ్రామ సర్పంచ్ శివకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్ కన్నా, మండల విస్తరణ అధికారి శాంసన్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

## పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ

**వెల్దండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** విడుదలైన 10వ తరగతి ఫలితాలలో వెల్దండ మండల విద్యార్థులు విజయదుందుభి మోగించారని ఎంఈఓ చంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 329 మంది విద్యార్థులకు గాను 325 (99శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. వెల్దండ మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ బొల్లంపల్లి, రాచుర్, బాలికల వెల్దండ, బాలురు వెల్దండ, పోతేపల్లి, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా పెద్దాపూర్ 96, కోట్ర 96, మోడల్ పాఠశాల 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు అందుకు కారణమైన ఉపాధ్యాయ బృందానికి ఎంఈఓ అభినందనలు తెలిపారు. అదేవిధంగా మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులలో 600 మార్కులకు గాను అత్యధిక 557 మార్కులు సాధించిన రాచూరు పాఠశాలల విద్యార్థిని హనియా ఫిర్దోజ్, 540 మార్కులు సాధించిన జెడ్పీహెచ్ఎస్ పెద్దాపూర్ పాఠశాల విద్యార్థిని శిరీష, 574 మార్కులు సాధించిన సోషల్ వెల్ఫేర్ బాలికల విద్యార్థిని అనుష్కలను ప్రత్యేకంగా అభినందిచారు.

## పదిలో మహాత్మా జ్యోతి బాపూలే
## బిసి గురుకుల విద్యార్థులు ప్రభంజనం

**కెటిదొడ్డి ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** బుధవారం రోజు మధ్యాహ్న విడుదల చేసినటువంటి పదవ తరగతి ఫలితాలలో కెటి దొడ్డి మండలానికి సంబంధించిన ర్యాలంపాడు రిజర్వాయర్ సమీపంలో ఇరిగేషన్ డిపార్టెంట్ భవనంలో ఉన్న కాలూరు తిమ్మన్‌దొడ్డి మహాత్మాజ్యోతి బాపూలే బిసి గురుకుల పాఠశాలలో 69మంది విద్యార్థులకుగాను 69మంది విద్యార్థులు పాస్ కావడంతో 100 ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 58 మంది ఉన్నారు. అందులో 575 మార్కులతో కె.వినీల్ కుమార్ అనే విద్యార్థి అత్యధిక మార్కులు సాధించడం జరిగింది. అదేవిధంగా యండి మహబూబ్ 568 మార్కులు, కె.తరుణ్ 565 మార్కులు,పి రామాంజి 562మార్కులు సాధించినందుకు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రావు,వైస్ ప్రిన్సిపాల్ మోజెస్, డిడబ్ల్యూ ఆశన్న,ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించడం జరిగింది.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

## విద్యార్థులకు గ్రామస్తుల ప్రోత్సాహం

**మాగనూర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాలలో మాగనూర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామానికి చెందిన అందరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను ఘనంగా శాలువలతో సన్మానించారు. ముందు చదువులకు తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేరీ మెమోరియల్ హైస్కూల్ ప్రిన్సిపల్ వెంకటేష్, వార్డ్ మెంబర్ మహదేవమ్మ ఎల్లప్ప, సాదు వెంకటేష్‌తో గ్రామస్తులు ఉన్నారు.



## మాదక ద్రవ్యాల నిర్మూలనకై ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలి : ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య

**అచ్చంపేట ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మాదక ద్రవ్యాల నిర్మూలనకై ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలని మాదక ద్రవ్యాలు అంతమొందించే విధంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య అన్నారు. బుధవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ నిర్మూలన సైబర్ క్రైమ్ నేరాల పై ఐసిడిఎస్ సిడిపిఓ లక్షి మ్మతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊళ్ళల్లో ఎటువంటి గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడుతున్నట్టు కానీ ఎక్కడైనా గంజాయి మొక్కలు పెంచుతున్నట్టు కానీ సమాచారం తెలిస్తే వెంటనే తెలియచేయాలని ఆయన సూచించారు. నేటి సమాజంలో యువత గంజాయికి బానిసై చెడుదారులకు దారి తీస్తుందని వీటిని నిర్మూలించే విధంగా ప్రతి ఒక్కరం ఈ మాదకద్రవ్యాలను రూపుమాపేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా సిడిపిఓ లక్షి మ్మ మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న పిల్లలు అతి తక్కువ ఉన్న పిల్లలు పౌష్టికాహారాలపై అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ అనంతరం ఒకటవ తరగతి చదువుటకు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సతీష్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్ సింగ్‌కు ఎస్‌పి ఘన నివాళి

**కుటుంబ సభ్యులకు ఎస్పీ జానకి పరామర్శ**

**అధైర్య పడొద్దు అండగా ఉండామంటూ భరోసా**

**మహబూబ్‌గర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హన్వాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ గోపాల్ సింగ్ (పి.సి. 612) ను ప్రభుత్వ ఆసుపత్రి మహబూబ్‌నగర్‌కు తరలించగా, తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్, మలక్‌పేట్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. బుధవారం అంత్యక్రియల సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి గోపాల్ సింగ్ స్వగ్రామమైన అమ్రియా నాయక్ తండ, కోయిలకొండ మండలంలో పాల్గొని,



గోపాల్‌సింగ్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎస్పీ జానకి



గోపాల్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకి

ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. 2002 బ్యాచ్‌కు చెందిన గోపాల్ సింగ్ తన విధులను నిబద్ధతతో నిర్వహించిన క్రమశిక్షణ గల సిబ్బందిగా గుర్తింపు పొందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె, కుమారుడు ఇంటర్ చదువుతున్నారు. చిన్న కుమార్తె పదవ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గోపాల్ సింగ్ కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహాయం అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రభుత్వ పరంగా లభించే ప్రయోజనాలు, తదుపరి చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ గోపాల్ సింగ్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించింది.

# బాలల సంరక్షణ, సైబర్ నేరాలపై అవగాహన

**అవసరాలకు తప్ప ఎట్టి పరిస్థితుల్లో సెల్ ఫోన్ ఉపయోగాన్ని ఎక్కువగా వినియోగించవద్దు : కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత వారం కార్యక్రమాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన అనే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం మున్సిపల్ ఆఫీసు, మక్తల్ లో 300ల మంది బాలికలతో ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ ఆన్ లైన్ గ్రూమింగ్ ,సైబర్ బులియింగ్ మొదలైన సైబర్ నేరాల ద్వారా చిన్నపిల్లలను మోసం చేయడం వారిని ఇబ్బందులకు గురి చేయడం లాంటి విషయాలపైన , ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్ ఉపయోగించడం వలన ఆన్లైన్ గేమ్స్, మెసేజ్ యాప్స్ ద్వారా పిల్లలను ట్రాప్ చేసే అంశాల గురించి అలాగే ఏఐ టెక్నాలజీ ద్వారా ఏ విధంగా మోసపోతారు అనే అంశాల గురించి పిల్లలకు పూర్తిగా అవగాహన కలిగించడం జరిగింది. సైబర్ నేరాలకు గురి కాకుండా పిల్లలు సెల్ ఫోన్ వారి యొక్క చదువుకు వారి యొక్క



మాట్లాడుతున్న కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

అవసరాలకు ఉపయోగించాలి తప్ప ఎట్టి పరిస్థితుల్లో సెల్ ఫోన్ ఉపయోగాన్ని ఎక్కువగా వినియోగించకూడదని, ఎలా జాగ్రత్తగా ఉండాలనే అంశం పైన మాట్లాడటం జరిగింది. చివరగా ప్రతి చైల్డ్ మంచిగా చదువుకొని వారి ఆర్థిక స్థిరత్వాన్ని సాధించి వ్యక్తిగతంగా వారి యొక్క గుర్తింపును నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్ గౌడ్, మక్తల్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య,మెడికల్ ఆఫీసర్ డా.హబీబ్, సిడిపిఓ సరోజ ,డిసిపిఓ కరిష్మా, సైబర్ సెల్ ప్రతినిధి రమేష్,ఇతర సిడిపీయూ, సి హెచ్ ఎల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# జడ్చర్లలో మూడు పాఠశాలల్లో 100% ఫలితాలు

**విద్యార్థులను అభినందించిన ఎంఈఓ మంజులాదేవి**



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంఈఓ మంజులాదేవి

**జడ్చర్ల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని 14 జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలల్లో మూడు పాఠశాలల్లో 100% ఫలితాలు సాధించగా మండలంలో సగటున 91% ఫలితాలు వచ్చాయని మండల విద్యాధికారిని మంజుల దేవి తెలిపారు. కోడుగల్,పెద్దఆదిరాలతో పాటు జడ్‌పిహెచ్ఎస్ బాదేపల్లి బాలికల పాఠశాలలో పదో తరగతిలో 100% ఫలితాలు వచ్చాయి. మండలంలో మొత్తం 795 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాక 718 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. పెద్ద ఆదిరాల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆరాధ్యకు 577 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

**పెద్ద ఆదిరాలలో..** జడ్‌పిహెచ్ఎస్ పెద్దదిరాల విద్యార్థులు ఎస్ఎస్సి 2026లో అత్యం త ప్రతిభ చూపారు. 67 మంది విద్యార్థులకు గాను 67మంది ఉత్తీర్ణత సాధించి 100% ఉత్తీర్ణత సాధించారు. కుమారి ఎం.ఆరా ధ్య 577 మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభను కనబరిచారు. 12 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ ప్రధానో పాధ్యాయులు,పాఠశాలఉపాధ్యాయులు అందరూ అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మంజులాదేవి విద్యార్థిని అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.

# భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ఆత్మకూర్ ఏప్రిల్ 29, ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించినటువంటి భూభారతి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విభాగం వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో భూభారతి, సాదా బైనమా దరఖాస్తుల పెండింగ్లో ఉన్న విషయాన్ని ఉచితంగా పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి భారతి చట్టం ద్వారా గ్రామాలలో నెలకొన్న సాదా బైనమా సమస్యలను పరిచయమే పరిష్కరించేందుకు తాసిల్దార్ చీరలు చేపట్టాలని ఈ విషయంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించమని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా మండలంలోని వివిధ గ్రామాలలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులతో పాటుగా మండల అధికారులు పర్యవేక్షిస్తూ ప్రగతి పోర్టును జిల్లా ఉన్నతాధికారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్టంలో ప్రత్యేకంగా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

అమలవుతున్నటువంటి సర్ విధానాన్ని అమలు చేసేందుకు చేపట్టినటువంటి చర్యలను బిఎల్వోలు నిశితంగా పరిశీలించి జనగణ చేసేందుకు దోహదం చేయాలని ఆయన సూచించారు. గతవారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ళను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ తాసిల్దార్ జె,కె.మోహన్ మండలంలోని గ్రామాలకు చెందిన పంచాయతీ, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగల ఇందిరమ్మ గృహప్రవేశాలు

**ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు**

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరిట గృహాలను మంజూరు చేసింది. ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్లను నిర్మించుకొని గృహప్రవేశాలను పండుగల జరుపుకుంటున్నారు.బుధవారం పరిధిపూర్ గ్రామంలో ఎంపీడీవో లక్ష్మీనరసింహులు మక్తల్‌సువర్ణ,వెంకటేశ్వరమ్మ లబ్ధిదారుల ఇందిరమ్మ గృహప్రవేశాలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంకా పూర్తిచేసుకొని వారు వెంటనే పూర్తిచేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ శివకుమార్,ఉపసర్పంచ్ నరసింహారెడ్డి,మాజీఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన నూతన కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



మంత్రిని కలిసి మొక్క అందజేస్తున్న నూతన కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**మక్తల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :**నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్‌గా వచ్చిన సిహెచ్ ప్రియాంక మక్తల్ పట్టణంలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.మంత్రి వాకిటి శ్రీహరి కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస ఉన్నారు.

## పదిలో టాపర్‌గా ఉప్పరిపల్లి వాసి



**ఉప్పునుంతల,ఏప్రిల్ 29 ప్రభాతవార్త :**2025,26 సంవత్సరం పదిపరీక్షల్లో ఉప్పరిపల్లి విద్యార్థిని టాపర్‌గా నిలిచారు. మండలంలోని ఉప్పరి పల్లి గ్రామానికి చెందిన దెంది చంద్రపాల్‌రెడ్డి కూతురు దెంది నందనరెడ్డి పదిలో టాపర్‌గా నిలిచారు. పదిలో అత్యధికంగా 585 మార్కులు సాధించడం పట్ల మండల ప్రజలు, ఉప్పరి పల్లి గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## క్రీడాకారులకు అల్పాహారం అందజేత

**ఉప్పునుంతల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు బుధవారం వెల్టూర్ గ్రామానికి చెందిన దేవర్ల నీలమణి, విష్ణు దంపతుల సౌజన్యంతో అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ పథకాలకు ఇంటర్వ్యూలు



ఉప్పునుంతల ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండలంలో ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగ యువతి యువకులకు బుధవారం ఉదయం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద 168 మంది దరఖాస్తులు చేసుకోగా, వారిలో 106 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా,62 మంది గై గైర్హాజరు అయినట్లు ఎంపిడిఓ వరుణ్ తేజ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వరుణ్ తేజ, బ్యాంకు అధికారులు, కార్యాలయం సిబ్బంది సాలార్, సింగోటం, సౌమ్య, శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**కోయిలకొండ ఏప్రిల్ 29, ప్రభాతవార్త;** కోయిలకొండ మండలం ఉబ్బడి తండా గ్రామపంచాయతీ పరిధిలోగల అంబ్రియా నాయక్ తాండ కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దహన సంస్కారాల నిమిత్తం మృతుడి కుటుంబానికి గ్రామ సర్పంచ్ హరి సింగ్ నాయక్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో తొలిస్థానం సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని



**నారాయణపేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పూర్విక విద్యార్థిని 587 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లావిద్యాశాఖ అధికారి గోవింద రాజులు ఆమెను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవిత తో పాటు ఉపా ధ్యాయ బృందం విద్యార్థిని ప్రతిభను ప్రశంసి స్తూ శుభాకాంక్ష లు తెలిపారు. కష్టపడి చదివి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చి నందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి ఫలితాలు సాధించడం ద్వారా పాఠశాల స్థాయి మరింత పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినికి సూచించారు.

## కల్వకుర్తిలో 100 శాతం ఉత్తీర్ణత



**కల్వకుర్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:**కల్వకుర్తి మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో మొదటి బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఫలితాలలో 70 మంది విద్యార్థులకు 70మంది ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తెలిపారు. 600 మార్కులకు ఎం.అశ్విత్ గౌడ్ 566, ఏ.ప్రమోద్ యాదవ్ 561, కే. వంశీ 558 మార్కులు సాధించారు. వీరితో పాటు 30 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం అభినందించారు.

# గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలక పాత్ర పోషించాలి

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** గ్రామాల సమగ్రాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోని 460 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ దేవ సహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్న ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, గ్రామ సర్పంచులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధం, తాగునీరు, మౌళిక వసతులు, హరితహారం, నిధుల వినియోగం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం మాత్రమే పనులు చేపట్టాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. తాను త్వరలోనే క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తానని, పంచాయతీ కార్యదర్శుల పనితీరును నేరుగా అంచనా వేస్తానని, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయడం అత్యవసరమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా ఉండాలని సూచించారు. ప్రజల నమ్మకం సంపాదించాలంటే సేవాభావంతో పనిచేయాలని, అప్పుడు మాత్రమే మంచి గుర్తింపు లభిస్తుందని, పంచాయతీ కార్యదర్శులు తమ స్వంత జిల్లాల్లోనే సేవలు అందించడం ఒక ప్రత్యేక అవకాశం అని పేర్కొంటూ, తమ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై అవగాహనతో త్వరితగతిన స్పందించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, అధికారులు లేదా ప్రజలు ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు వెంటనే స్పందించి సరైన సమాచారం ఇవ్వాలని, ఎక్కువ సమయం తమ తమ పంచాయతీ పరిధిలోనే గడుపుతూ ప్రజలకు చేరువ కావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను (కేజీబీవీలు) అధికారులు తరచుగా సందర్శించాలని, విద్యార్థులకు అందిస్తున్న విద్య సదుపాయాలు, వసతి, తాగునీరు, పారిశుద్ధం, ఆరోగ్య పరిరక్షణ చర్యలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నా భోజనం మరియు వసతి గృహాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలను ప్రత్యేకంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని మౌళిక వసతులు సక్రమంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ పరిధిలో వచ్చే ప్రజా ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు గ్రామస్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకొని ప్రజలకు ఉపశమనం కల్పించాలని, మీ పరిధిలో లేని అంశాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.




నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న కెవికె పాలెం శాస్త్రవేత్తలు

**మద్దూర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మద్దూర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. కెవికే-పాలెం శాస్త్రవేత్త డా.ఓ. శైలా, మండల వ్యవసాయ అధికారి ఏ. ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి కే. శ్రవణ్ కుమార్ పాల్గొని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు ధృవీకరిత విత్తనాలు మాత్రమే వాడాలని, అధిక మొలక శాతం మరియు నాణ్యత ఉన్న విత్తనాలు దిగుబడిని పెంచుతాయని వివరించారు. డ్రిప్, స్ప్రింక్లర్ సేద్య పద్ధతులు ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు పంటలకు సరైన మోతాదులో నీరు అందించవచ్చని సూచించారు. నేల పరీక్షల ఆధారంగా నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం సమతుల్యంగావాడాలని, సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలనితెలిపారు. కీటకాల నియంత్రణలో జీవపద్ధతులు, ఫెరోమోన్ ట్రాప్స్ ఉపయోగించడం, అవసరమైతే మాత్రమే రసాయన మందులు వాడడం మంచిదని సూచించారు. పంటల వైవిధ్యీకరణ, సేంద్రీయ వ్యవసాయం ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. నానో యూరియా వినియోగంద్వారా తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆశంగారి సత్యమ్మ, ఉప సర్పంచ్ పి.కవిత, గ్రామ ప్రముఖులు కృష్ణ వేణుగోపాల్, రాజు, అవినాష్, లక్ష్మీనారాయణ, హనుమంతు గౌడ్ తదితరులుపాల్గొన్నారు. గ్రామానికి చెందిన అనేక మంది రైతులు హాజరై శాస్త్రవేత్తల సూచనలను ఆసక్తిగా విన్నారు.

## జనసేనలో చేరిన సాహిత్య పరిషత్తు జిల్లా అధ్యక్షుడు గుడిసె నరసింహులు

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్రయువజన విభాగం ఆడ్‌హాక్ కమిటీ సభ్యులు డా.మణికంఠగౌడ్ ఆధ్వర్యం లో నారాయణ పేట జిల్లా వాస్తవ్యులు గుడేసె నర్సిములు రాష్ట్ర నాయకులను కలిసి మక్తల్ లో మే ఒకటో తారీఖున చేరబోతున్నట్టు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నేను బాల్యం నుండి సేవ చేయాలనే దృక్పదం, సామాజిక సేవలలో పాల్గొనడం జరిగింది. రచయితగా, ప్రస్తుత సాహిత్య పరిషత్తు నారాయణపేట జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్నానని తెలుపుతూ గత కొన్ని రోజులనుండి జనసేనపార్టీ కార్యకలాపాల గురించి సునిశితంగా పరిశీలించానన్నారు. సామాజిక సమన్యాయం కులరహిత కుటుంబ రహిత పర్యావరణ పరిరక్షణ సనాతన ధర్మం కోసం ఆయన దేశం కోసం పడుతున్న తపన ఆయన ఆశయాలు పార్టీ సిద్ధాంతాలు పార్టీ కూడా తెలంగాణలో పురుడుపోసుకొని పుష్కర కాలం పాటు ఎక్కడ తగ్గకుండా అనేక సమస్యలపై కూడా తెలంగాణ రాష్ట్రనాయకత్వం అలాగే తట్టుకొని నిలబడడం జనసేనపార్టీ నిబద్ధత చూసి ఆకర్షితుడునై నారాయణపేట జిల్లాలో కూడా డా. మణికంఠగౌడ్ పార్టీ కోసం ఆయన కృషి ఆయనపడే తపన పవన్‌కళ్యాణ్ ఆశయాల అడుగుజాడలో ఆయన నడుస్తున్న తీరుఒక సరికొత్త యువ నాయకత్వం నారాయణపేట అన్ని నియోజకవర్గాలలో అవసరమని నమ్ముతూ తెలంగాణ అభివృద్ధి లో జనసేనపార్టీ భవిష్యత్తులో అవసరం అని ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకొనడం జరిగిందని ఆయన ఓ ప్రకటనలో తెలియజేశారు.

## వరి కోతల సమయంలో డీజిల్ కొరత తొలగించాలి



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**నారాయణ పేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా బీజ్వార్ గ్రామంలో వరి కోతల సమయంలో ఏర్పడిన డీజిల్ కొరతను వెంటనే నివారించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజ్వార్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. డీజిల్ కొరత కొనసాగితే అకాల వర్షాలు, వడగళ్ల వానల కారణంగా వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా నాయకులు జగదీష్, ప్రధాన కార్యదర్శి హన్మిరెడ్డి, గ్రామ కార్యదర్శి రామలింగంగౌడ్, సప్పటి అంజి మాట్లాడుతూ ఇప్పటికే రైతు బంధు సాయం సమయానికి అందక, వడ్డీలకు డబ్బులు తెచ్చుకుని పంటలు సాగు చేస్తున్న రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుకోకుండా వచ్చే వర్షాలు, వడగళ్ల వానల వల్ల రైతులకు నష్టం పెరిగే అవకాశముందని తెలిపారు. ఇప్పటికే అనేక రైతు కుటుంబాలు అప్పుల బారిన పడి వడ్డీలు చెల్లిస్తూ కష్టాలు పడుతున్నాయని ఈ సమయంలో డీజిల్ కొరత వ్యవసాయ పనులను ప్రభావితం చేసి వారి ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి గోనె సంచులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గోనె సంచుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వడ్ల బిల్లులతో పాటు బోనస్‌ను కూడా వెంటనే చెల్లించాలని, రైతులకు సరైన మద్దతు ధర కల్పించి ఆలస్యం లేకుండా కొనుగోళ్లు జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజ్వార్ బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## కల్వకుర్తిలో మేకల, గొర్ల సంత ప్రారంభోత్సవం



మేకల, గొర్ల సంతను ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి మార్కెట్‌యార్డ్‌లో బుధవారం మేకల, గొర్ల సంతను కల్వకుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో కల్వకుర్తి మున్సిపల్ ఛైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సంతను కల్వకుర్తి పరిసర గ్రామ ప్రజలఇబ్బందులను తెలుసుకొని ఛైర్మన్ మనిలా సంజీవ్ కుమార్ దూర దృష్టితో ఆలోచించి కల్వకుర్తిఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. సంతను రైతులు, ప్రజలు ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సంతలో మొదటి మేకను మీసాల అంజయ్య (చెదురుపల్లి)కొనుగోలు చేశారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామోదర్ గౌడ్

**కొల్లాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ కేశవ్‌పాటిల్ తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ తెలంగాణ పంచా యతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బ దామోదర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.



అనం తరం నాగర్ కర్నూల్ జిల్లాలోపంచాయతీ సెక్రెటరీస్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులు, పరిపాలనకు సంబంధించిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని దామోదర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి, అన్వేష్, రవితేజ, శ్రవణ్, మల్లికార్జున్, సాయికృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో 19వ స్థానంలో నిలిచిన వనపర్తి జిల్లా

◆ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్

◆ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన అదనపు కలెక్టర్



డీఈఓ ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక దృష్టి, విద్యా రంగంపై తీసుకున్న కృషి ఫలితంగా వనపర్తి జిల్లా ఎస్ఎస్సి ఫలితాల్లో మెరుగైన స్థానం సాధించిందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎస్ఎస్సి ఫలితాల విడుదల నేపథ్యంలో వనపర్తి జిల్లా 97.46 ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 19వ స్థానంలో నిలిచిన సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని ఆధ్వర్యంలో అధికారులు అదనపు కలెక్టర్‌ను తన చాంబర్లో కలిశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా ఎస్ఎస్‌సి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 97.46 శాతం ఉత్తీర్ణతతో 19వ స్థానాన్ని సాధించడం గొప్ప విషయమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7210 విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 7027మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక దృష్టి, విద్యా రంగంపై తీసుకున్న కృషి ఫలితంగా ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పేర్కొన్నారు. గతేడాది ఎస్ఎస్‌సి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 29వ స్థానంలో ఉన్న వనపర్తి జిల్లా ఈసారి 10 స్థానాలు మెరుగుపడడం విద్యాశాఖ కృషికి నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్ జిల్లా విద్యాశాఖ అధికారులను, ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, సంబంధిత సిబ్బందిని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యాశాఖ సిబ్బంది సమిష్టి కృషితో జిల్లా మంచిస్థానం సాధించిందని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఈసారి ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడిన విషయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వచ్చే సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలుసాధించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులు



రమేష్ చంద్ర (579)



యశ్వంత్ (574 )



బిందు భార్గవి (570)

**లింగాల, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను కనబరుచుతూ అత్యుత్తమ ఫలితాలను సాధించారు. మండలంలోని ఆరు పాఠశాలల్లో లింగాల జడ్పీహెచ్ఎస్ పాఠశాల తప్ప మిగతా 5 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం. బుధవారం విద్యాశాఖ పదవ తరగతి విద్యార్థుల ఫలితాలను ప్రకటిస్తూ మార్కులను వెల్లడించారు. బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల అంబటిపల్లి విద్యార్థి ఉమేష్ చంద్ర సత్తా చాటుతూ 600 మార్కుల గాను 579 మార్కులనుసాధించి మండల టాపర్ గా నిలిచాడు. అదేవిధంగా ఇదే పాఠశాల చెందిన సాంసన్ (574), యశ్వంత్(574) ప్రావీణ్యం కనబడుచుతూ మండల రెండవ స్థానం సంయుక్తంగా పొందారు. జడ్పీహెచ్ఎస్ లింగాల విద్యార్థిని బిందు తన ప్రతిభను చాటుతూ 570 మార్పులను సాధించింది. పాఠశాలలవారీగా మొదటి మూడు స్థానాలు నిలిచిన విద్యార్థులు అంబటిపల్లి బీసీ రెసిడెన్షియల్ (69కి 69 ఉత్తీర్ణతతో 100శాతం) ఉమేష్ చంద్ర 579, శాంసన్ 574, యశ్వంత్ 574, లింగాల హై స్కూల్ (91కి గాను 90% ఉత్తీర్ణతతో 98.9 శాతం) బిందు 570, మీనాక్షి 541, భవ్య శ్రీ 534, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(79 కు 79 తో 100% ఉత్తీర్ణత ) దినకర్ 544, శరత్ భాను543, సుశాంత్ రెడ్డి 541, అంబటిపల్లి హై స్కూల్ (33కు33తో ఉత్తీర్ణతతో 100 శాతం )సుహాని 533, సుష్మ 532, వైష్ణవి 519, కేజీబీవీ (47కు 47తో 100 శాతం ఉత్తీర్ణత) శివాని 545, నందిని 531, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల(42 కు 42 తో శాతం ఉత్తీర్ణత) రమ్య 530, భార్గవి 529 మార్కులను సాధించారు. చదువులో ప్రతిభ కనబరిచి విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి బషీర్ అహ్మద్ అభినందించారు. మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల అంబటి పల్లి హైస్కూలు జిహెచ్ఎం నిరంజన్, టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ ప్రిన్సిపాల్ శ్రీను, జడ్పిహెచ్ఎస్ లింగాలఇన్చార్జి హెచ్ఎం కొండయ్య, కేజీబీవీ ఎస్ శారద, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మంగమ్మ, అంబటిపల్లి బీసీ గురుకుల పాఠశాల హెచ్ఎం రజిత ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పది ఫలితాలలో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



వినయ్ కుమార్ (583)



రామ్ చరణ్ (566)

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ పది ఫలితాలలో జ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థి వినయ్ కుమార్ 600 మార్కులకుగాను 583 మార్కులను సాధించి సత్తాచాటి మండల టాపర్‌గా నిలిచారు. గురుకుల పాఠశాలలోని మరో విద్యార్థి రామ్‌చరణ్ 600/566 మార్కులతో మండల ద్వితీయ స్థానంలో నిలిచారు. మండల టాపర్‌గా, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యా ర్థులను మండల విద్యాధికారి టి.మురళీకృష్ణ, ఎంజెపి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశంలు అభినందనలు తెలిపారు. గౌతం మోడల్ హై స్కూల్ విద్యార్థి అఫ్రోజ్ 600 మార్కులకు గాను 565 మార్కులు సాధించి మండల తృతీయ స్థానంలో నిలిచారు. పది ఫలితాలలో తృతీయ స్థానం సాధించిన అఫ్రోజ్‌కు పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ రాధికలు అభినందనలు తెలిపారు. మండలంలో ఏడు జడ్పి ఉన్నత పాఠశాలలో 422 మంది విద్యార్థులు పది పరీక్షలు వ్రాయగా 396 మంది విద్యా ర్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 94 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు మండల విద్యాధికారి మురళి కృష్ణ తెలిపారు.

## వంద శాతం ఉత్తీర్ణత

**ఉప్పునుంతల, ఏప్రిల్29 ప్రభాతవార్త:** 2025,26 సంవత్సరానికి గాను పది పరీక్షలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ వివరించారు. మొత్తం 222 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా 222 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 54 మందికి 54 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కంసాని పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 24 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్టూర్‌కు చెందిన విద్యార్థులు 16మంది హాజరు కాగా 16మంది ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెనిమిళ్ళలో 15 మందికి 15 మంది, కెజివిబి లో 42 మంది కి 42 మంది, ఎంజెపిటి బిసి వెల్ఫేర్ బాలికల పాఠశాల వెల్టూర్ 71 మందికి 71 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ వివరించారు. మండల టాపర్‌గా గురుకుల పాఠశాల విద్యార్థిని మమత పది పరీక్షలో మండల టాపర్ మహాత్మా జ్యోతిరావు పూలే గాంధీ విద్యాలయం వెల్టూర్ పాఠశాలకు చెందినమమత 573 మార్కులు సాధించి మండల టాపర్ నిలిచారు. అదే గురుకుల పాఠశాల వెల్టూర్‌కు చెందిన విద్యార్థిని అక్షిత 570 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. కెజివిబి విద్యార్థినీ నవ్యశ్రీ 569 మార్కులు సాధించి ముడో స్థానంలో నిలిచారు. మండలంలో పది పరీక్షలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల మండల ప్రజలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## మెరిసిన విద్యా కుసుమం

### -సర్కారు బడికి వన్నెతెచ్చిన విద్యార్థిని
### -మండల టాపర్‌గా హర్షవర్ధిని



మండల టాపర్‌గా హర్షవర్ధిని

**వంగూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ప్రైవేటు పాఠశాలలలో చదివించే స్తోమత లేకపోయిన తమ బిడ్డ భవిష్యత్తు బాగు పడాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలకు పంపించిన ఆ తల్లిదండ్రుల ఆశయ సాధనను నెరవేర్చడానికి ఇష్టంతో కష్టపడి చదివిన విద్యార్థిని మండల టాపర్‌గా నిలిచి సర్కారు బడికి వన్నె తెచ్చింది. బుధవారం విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో వంగూరు సోషల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న హర్షవర్ధని 600 మార్కులకు 554 మార్కులు సాధించి తన సత్తాను చాట్టుకొని మండల టాపర్‌గా నిలిచింది. హర్షవర్ధిని 4వ తరగతి చదువుతున్న సమయంలో ఆమె తండ్రి గుమ్మడి జైపాల్ ముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. జైపాల్ మృతి చెందిన కుటుంబభారాన్ని భుజాన వేసుకొని తన ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనే లక్ష్యంతో తల్లి పద్మ వంగూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో హర్షవర్ధిన్ని చేర్పించింది. తండ్రి లేకపోయిన ఆ తల్లిదండ్రులు కన్న కళలను నిజం చేయాలని తండ్రి ఆశయాలను తల్లి బాధ్యత ను ఎక్కడ కూడా ఒమ్ము చేయకుండాకష్టపడి చదివి ఇష్టంతో రాసిన పరీక్షలో మండల టాపర్‌గా నిలిచి ఆతల్లి కోరికనెరవేర్చి ఆనందాన్ని పంచింది. వంగూరు మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన పద్మ జైపాల్ ముదిరాజ్‌కు ముగ్గురు సంతానం వారిలో ఇద్దరు ఆడ పిల్లలుఅందులో హర్షవర్ధిని చిన్నకూతురు. విద్యను నేర్చు కోవడానికి పేదరికంఅడ్డురాదని, పట్టుదలతో చదువుకొని మండల టాపర్‌గా నిలిచి నిరూపించింది విద్యార్థిని హర్షవర్ధిని. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలువేస్తున్నారని దానికినిదర్శనంగాహర్షవర్ధిని నిలిచిందన్నారు.

## పదిలో మండల టాపర్‌గా వీపనగండ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి



గౌతమ్ చక్రి (559)

**వీపనగండ్ల ఏప్రిల్29, ప్రభాతవార్త;** 10వ తరగతి పరీక్ష ఫలితాలలో వీపనగండ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల మండలంలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించగా రెండవ స్థానంలో కల్వరాళ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని నిలిచినట్లు మండల విద్యాధికారి నరసింహ తెలిపారు. బుధవారం నాడు పదవ తరగతి ఉతీర్ణత ఫలితాలు ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో వీపనగండ్ల మండలానికి సంబంధించి ఏడు ఉన్నత పాఠశాలలో, ఒకటి కస్తూర్బా పాఠశాలలో 100కు 100 విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. మొత్తం విద్యార్థులు 158 మంది పరీక్ష వ్రాయగా 158 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇందులో వీపనగండ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి గౌతమ్ చక్రి ఇంగ్లీష్ మీడియంలో 600 మార్కులకు గాను 559 మార్కులు సాధించి మండల్ టాపర్గా నిలిచాడు. అదేవిధంగా జెడ్‌పిహెచ్ఎస్ కల్వరాళ్ల పాఠశాలకు రెండవ స్థానం ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని జువేరియా 600 మార్పులకు గాను 537 మార్కులు సాధించింది. వీపనగండ్ల కస్తూర్బా పాఠశాల విద్యార్థిని తెలుగు మీడియం లో యామిని 600 మార్కుల గాను 545 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. మండల ద్వితీయ స్థానంలో అదే పాఠశాలకు చెందిన తెలుగు మీడియం భార్గవి 600 గాను 534 సాధించి రెండవ స్థానంలో నిలిచింది. ఈ విధంగా మండలంలో టాపర్గా నిలిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఎంఈఓ నరసింహ, ఉపాధ్యాయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

## పదిలో ప్రతిభ చాటుకున్న విద్యార్థులు

**అచ్చంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** విద్యాశాఖ పదవ తరగతి విద్యార్థుల ఫలితాలను ప్రకటిస్తూ మార్పులను వెల్లడించారు. పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభను కనబరుచుతూ అత్యుత్తమ ఫలితాలను సాధించారు. మండలంలోని 12 పాఠశాలల్లో రెండు పాఠశాలల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 566 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 564 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

## పదో తరగతి ఫలితాలలో బాలికలదే పైచేయి

■ ఎంఇఓ పి.ఇమాన్యుయేల్

**కొల్లాపూర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** కొల్లాపూర్ మండలంలో దాదాపు అన్ని పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని అత్యధిక మార్కులు కెజిబివి కొల్లాపూర్ బి.పూజిత 565 /600, జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికలు కొల్లాపూర్‌లో రోష్ని విద్యార్థిని 557/600, తాంజియా 555/600, జిల్లా పరిషత్ హైస్కూల్ కుడికిల్లలో సాగది మీనా కుమారి 551/600, జిల్లా పరిషత్ హైస్కూల్ నార్లాపూర్ యుగంధర్ 543 మార్కులు సాధించారు. అలాగే పెంట్లవెల్లి మండలంలోని అన్ని పాఠశాలలు కూడా 100% ఉత్తీర్ణత సాధించినవి. పెంట్లవెల్లి మండలంలోని కెజిబివిలో ఎం. శ్రావణి 579/600, కె.మంజుల 567/600 అత్యధిక మార్కులు సాధించారు. స్టేట్ 2వ ర్యాంక్ నాగర్ కర్నూల్ జిల్లా దే జిల్లాల వారీగా చూస్తే నాగర్ కర్నూల్ జిల్లా 99.03 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ రాష్ట్రంలో రెండో స్థానం సాధించింది. మొత్తం 10.641 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 10.538 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 5.192 (98.74 ), బాలికలు 5.346(99.31 ) పాస్ అయ్యారు. ఈ సందర్భంగాఎంఇఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం సంతోషకరమని కష్టపడితే సాధించలేనిది ఏది లేదు అని అన్నారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

## పది తరగతి ఫలితాలలో దేవరకద్ర, కౌకుంట్ల మండలాల విద్యార్థుల ప్రతిభ

**దేవరకద్ర, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాలలో దేవరకద్ర, కౌకుంట్ల మండలాల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 100% ఉత్తీర్ణతతో పిఎం జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ దేవరకద్ర విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డోకూరు విద్యార్థులు 96% ఉత్తీర్ణతను సాధించారు. కేజీబీవీ విద్యార్థులు 100% ఉత్తీర్ణతను సాధించారు. మండల టాపర్‌గా పీఎం జడ్పిహెచ్ఎస్ బాలికలు దేవరకద్ర పాఠశాలకు చెందిన బి.నిక్షల 572 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన పి.ప్రవీణ్ నాయక్ 562 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా కౌకుంట్ల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ విద్యాసంస్థ అయిన పోలైట్ హైస్కూల్ పాఠశాల విద్యార్థులు వైష్ణవి, ఉదయ్ కుమార్, రాహుల్, రామ్ చరణ్ అధిక మార్కులు సాధించి, 100శాతం ప్రతిభను చాటారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి పి.బలరాం అభినందించారు.

## పది ఫలితాలలో ప్రతిభ కనబరిచిన ఎంజెపి బాలుర (బి)గురుకుల పాఠశాల విద్యార్థులు

**మక్తల్ టౌన్, ఏప్రిల్29 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో అంబేద్కర్ నగర్‌లో ఉన్న గురుకుల పాఠశాల మక్తల్ బాలుర (బి) పాఠశాలలో విద్యార్థులు పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 69 విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో68 మంది అప్రూవల్ సాధించారు. ఒకరు మాత్రమే ఫెయిల్ అవ్వగా అత్యధిక మార్కులు సాధించిన గుడిసె ప్రణవ్ సాగర్ 567 మార్కులు సాధించి మొదటిర్యాంకును సంపాదించగా, ఎం.తరుణ్ 561 మార్కులు సాధించారు. మూడవ ర్యాంకు సాధించిన విద్యార్థి కుమార్ 555 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచారు. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రాములు అభినందించారు. 500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 39 విద్యార్థులు ఉన్నారని పాఠశాల ప్రిన్సిపల్ రాములు తెలియజేశారు. ఉత్తీర్ణత శాతం 98.5.గా నమోదైనది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు డయల్ యువర్ డిఎం

**అచ్చంపేట, ఏప్రిల్, 29 ప్రభాతవార్త:** నేడు డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మురళి దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేడు గం,11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిపో అభివృద్ధికి ప్రయాణికులు తమ సలహాలు. అదే విధంగా సౌకర్యాల సమస్యలపై, సూచనలను 94408 18849 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులను అభినందించిన జిల్లా ప్రధాన ఉపాధ్యాయుడు వరప్రసాద్

**పెద్దమందడి, ఏప్రిల్29 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదిగట్ల మోజర్ల పాఠశాలలో 100% ఉత్తీర్ణతతో విజయఢంకా మ్రోగించినట్లు ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ రావు తెలిపారు. మద్దిగట్ల మోజర్ల పాఠశాలలో పదో తరగతి పరీక్షలను 26 మంది విద్యార్థులు హాజరు కాగా 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి విజయ డంకా మోగించారు. 500 మార్కులకు పైగా 16 మంది విద్యార్థులు 350కి పైగా ఐదు మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగింది. కుమారి దీప్తి 536 మార్కులతో తెలుగు మీడియం విభాగంలో పాఠశాలలు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఫలితాల పట్ల పాఠశాల విద్యార్థులను అభినందించినట్టు ప్రధాన ఉపాధ్యాయులు వరప్రసాద్ రావు హర్షం వ్యక్తం చేశారు. తనతోపాటు ఉపాధ్యాయులు పి.వెంకటస్వామి, కృష్ణయ్య, వాణి ప్రభ పుల్లయ్య, మధుసూదన్, ఎన్.వెంకటస్వామి, ఎ.వెంకటస్వామి, శ్రీనివాసులు, చిన్నారెడ్డి, కృష్ణవేణి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించుట సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించుట ఫార్మల్ బోర్డుల ద్వారా వీడియో పాఠా తెలియజేయుట మొదలగు అంశాల వలన ఇటువంటి విజయాన్ని సాధించిపెట్టిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ రావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతులు సేంద్రియ పద్ధతులు పాటించాలి

**మాగనూర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రైతులు పంటలు పండించే విధానంలో సేంద్రీయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ కళాశాల పాలెం శాస్త్రవేత్తలు డా.ఎం ఆర్ భానుశ్రీ, డా.వి.అనిల్ రైతులకు అవగాహన కల్పించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు మోతాదుకు మించి యూరియా వాడకం, పురుగుల మందు, పంట మార్పిడి, మార్కెట్ డిమాండ్ ఆధారంగా పంటలను సాగు చేసి నీటి వినియోగాన్ని తగ్గించడం పట్ల రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ డా.సుదర్శన్ గౌడ్, ఏఈఓ పవన్, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో పాటు రైతులు పాల్గొన్నారు.



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో శాస్త్రవేత్తలు



ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన వారికి నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

## పండగలా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

**దేవరకద్ర, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి భారీ ఎత్తున గృహప్రవేశాలు చేస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర మండలం మినుగోన్ పల్లి, గుడిబండ, గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లగృహప్రవేశాల కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోయిల్ సాగర్, గుడిబండ, గ్రామాలలో పలు వివాహ వేడుకలకు హాజరై ,నూతన వధూవరులను ఆశీర్వదించి,తదనంతరం చిన్నరాజమూర్ గ్రామంలో కురుమూర్తి స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు గోపాల్ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిబండ సర్పంచ్ నరసింహులు,గుడిబండ అమరేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్‌అలీ,అంజన్ కుమార్‌రెడ్డి,రాజుగౌడ్ ముచ్చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, ఉషనప్ప, నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరు: బీఆర్ఎస్వి జిల్లా నాయకుడు డి.శేఖర్

**కొల్లాపూర్,ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ను విడుదల చేసేంతవరకు పోరాటం ఆగదని ఈ సందర్భంగా బిఆర్ఎస్వి జిల్లా నాయకుడు డి.శేఖర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్షిప్ విడుదలయ్యే వరకు పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్కాలర్షిప్ అనేది విద్యార్థుల హక్కు అనే దానికోసం పోరాటం చేస్తామని అన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ కుటుంబాలకు చెందిన పేద విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లపై ఆధారపడి ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు కాబట్టి విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 11వేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయి అని అన్నారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్వి ఎప్పటికీ వెనక్కి తగ్గదు.. పోరాటం కొనసాగుతుంది అని ఈ సందర్భంగా అన్నారు.

## అదుపుతప్పి కారు బోల్తా



క్షతగాత్రులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తున్న అటవిశాఖ ఉన్నతాధికారులు

**అచ్చంపేట, ఏప్రిల్29 ప్రభాతవార్త:** అమ్రాబాద్ నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలంహైదరాబాద్ ప్రధాన రహదారిపై వటవర్లపల్లి సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. ఆమనగల్ గ్రామానికి చెందిన రమేష్ తన కుటుంబంతో కలిసి శ్రీశైలం నుండి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా, కారు అదుపు తప్పి బోల్తా పడింది.అదే సమయంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శివప్రసాద్, బీట్ ఆఫీసర్ సరిత, డ్రైవర్‌ఖాదర్ ప్రమాదాన్ని గమనించి క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను అత్యంత జాగ్రత్తగా బయటకు తీసి, తమ పెట్రోలింగ్ వాహనంలో తరలించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, గుండం బేస్ క్యాంప్ వద్ద బాధితులను అంబులెన్స్ సిబ్బందికి అప్పగించి తమ ఉదారతను చాటుకున్నారు.ఈ ప్రమాదంలో ఒక మహిళ చేయి విరగగా,ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆపద సమయంలో వేగంగా స్పందించి ప్రాణరక్షణ చర్యలు చేపట్టిన శివప్రసాద్, సరిత, ఖాదర్‌లను అటవీ శాఖ ఉన్నతాధికారులు స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన అన్నదానం కృష్ణయ్య

**వెల్దండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గల హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద బుధవారం మండల కేంద్రానికి చెందిన అన్నదానం కృష్ణయ్యచారి తన స్కూటీపై పెట్రోల్ బంకులోకి వెళ్తుండగా కల్వకుర్తి నుండి అతివేగంగా వస్తున్న ఇన్నోవా కారు బలంగా ఢీకొనడంతో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కృష్ణయ్యను అంబులెన్స్ ద్వారా మండల కేంద్రంలోని యెన్నం ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందిస్తున్నారు.

## సామా జగన్‌మోహన్ రెడ్డికి ఘన నివాళి



జగన్‌మోహన్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్,ఏప్రిల్29, ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో సామా జగన్ మోహన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఎబివిపి పాలమూరు యూనివర్సిటీ అధ్యక్ష,కార్యదర్శులు రవితేజ, రవి కిషోర్ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం నడిబొడ్డున జాతీయ పతాకానికి జరిగిన అవమానాన్ని ఎదిరించి ప్రాణాలర్పించిన మొట్టమొదటి జాతీయవాది సామా జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మహేశ్వరి,ఉపాధ్యక్షులు భాను,హరికృష్ణ, సంయుక్త కార్యదర్శిలు గోపాల్,భరత్,కళామంచ్ కన్వీనర్ శైలజ,సింధు,అర్చన,మౌనిక, స్వరూపరాణి, క్రితిక, యువకుమార్, అశోక్, శివశంకర్, సాయిచరణ్ పాల్గొన్నారు.

## 'శత' శాతం విద్యార్థులే టాపర్లు

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించాలంటే, వాటిని ప్రచారం చేయడం అత్యవసరమని, వాట్సాప్ గ్రూపులు, ఇతర వేదికల ద్వారా ఈ విజయాన్ని అందరికీ తెలియజేయాలని సూచించారు. పాఠశాలల్లో కంప్యూటర్ సదుపాయాలను పెంచి, ప్రతి విద్యార్థికి టెక్నాలజీ పరిజ్ఞానం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మొత్తంగా, విద్యార్థులు ఈ విజయాన్ని మొదటి అడుగుగా భావించి, తమ లక్ష్యాలను చేరుకునే వరకు క్రమశిక్షణతో కృషి చేయాలని, చదువే వారి భవిష్యత్తును నిర్మించే ప్రధాన మార్గమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలోనగర మేయర్, గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండామనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనలో నెరవేరిన సొంతింటి కల

- మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రంగినేని శ్రీనివాసరావు
- గ్రామాల్లో అట్టహాసంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు



ఇందిరమ్మ గృహ ప్రవేశంలో పాల్గొన్న నాయకులు

**లింగాల,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేరిందని, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ సహకారంతో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అండగా నిలుస్తామని అన్నారు.అంబటిపల్లి, శాయిన్ పేట గ్రామాలలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లబ్ధిదారులు కట్టుకున్న ఇందిరమ్మ గృహప్రవేశాన్ని ఆయన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలకు ఇల్లునిర్మించి ఇచ్చి వారు సొంతింట్లో జీవించాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఇంటి ఐదు లక్షల రూపాయలు అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆత్మగౌరవ ప్రతీకగా భావించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందన్నారు. పల్లెల్లో గుడిసెలు ఉండకూడదనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను గతంలో నిర్మించినట్లు గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో దగాపడ్డారని, డబుల్ బెడ్ రూములను నిర్మించి ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పేదరిక నిర్మూలన ధ్యేయంగా పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రజలకు సరియైన న్యాయం జరుగుతుందని అన్నారు. పేదలకు అండగా నిలిచే కాంగ్రెస్ ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, అంబటిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అచ్యుతారెడ్డి, శాయిన్‌పేట సర్పంచ్ మంజుల సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

# మే1న శిల్పారామంలో మెగా జాబ్ మేళా

10,000 మంది నిరుద్యోగ యువత పాల్గొనే అవకాశం

ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటి శాఖా మంత్రి శ్రీధర్ బాబు,

ఎక్సైజ్ పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు,

రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి



జాబ్‌మేళా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, ఏప్రిల్29, ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెగా జాబ్ మేళా మే 1న మహబూబ్‌నగర్ పట్టణం పెద్ద చెరువు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. శిల్పారామంలో నిర్వహించనున్న జాబ్ మేళా స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1న నిర్వహించబోయే జాబ్ మేళా, తెలంగాణలోనే తొలి మెగా జాబ్ మేళా అని అన్నారు. హైదరాబాద్ నుండి సుమారు 80 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నాయని, అలాగే జిల్లాలో స్థానికంగా ఉన్న 35 కంపెనీలు కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయి అన్నారు. వీరికొరకు దాదాపు 120 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు అదనపు కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 10,000 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. మెగా జాబ్ మేళా ప్రారంభోత్సవానికి మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ 120 మంది పంచాయతీ కార్యదర్శులను, ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని, జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థుల నమోదు ప్రక్రియను వీరి సహకారంతో వేగవంతం చేయాలని సూచించారు. జాబ్ మేళాలో మొత్తం 30 కౌంటర్ల ద్వారా రిజిస్ట్రేషన్లను నిర్వహిస్తారని తెలిపారు. మున్సిపల్ శాఖతో పాటు యువజన, క్రీడల శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఎన్ఐసి,పోలీస్, మెప్మా, డిఆర్‌డిఏ , పరిశ్రమల శాఖ, పంచాయతీరాజ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ వారు జాబ్ మేళా సందర్భంగా రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు, శిల్పారామం వైపు వెళ్లేరహదారులపై ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బందిని నియమించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం యాదయ్య,జిల్లా యువజన,క్రీడల అధికారి రాజశేఖర్ రెడ్డి, డిఎంహెచ్‌ఓ డా. కె.కృష్ణ వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా టాపర్‌గా రిషి విద్యార్థి కార్తికేయరెడ్డి

● 594 మార్కులు సాధించి జయకేతనం ● రిషి పాఠశాల టాపర్లను అభినందించిన విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



రిషి విద్యార్థులను అభినందిస్తున్న విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం ప్రకటించిన ఎస్ఎస్‌సి పరీక్షల ఫలితాలలో న్యూ రిషి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు. ఈ ఫలితాల్లో బి.కార్తికేయ రెడ్డి 594 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవడం విశేషంగా నిలిచింది. అదేవిధంగా శ్రీకర్ 586 మార్కులు, జి. దివ్యశ్రీ 582 మార్కులు, సి.హెచ్. జస్వంత్, ఎస్.సాయి కీర్తన 580 మార్కులు సాధించి జిల్లాలో అగ్రశ్రేణి ఫలితాలు నమోదు చేశారు. విద్యార్థుల ఈ ప్రతిభతో పాఠశాల జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. విద్యార్థుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం కలిసివచ్చిన ఫలితమే ఈ విజయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధన సిబ్బందిని యాజమాన్యం హృదయపూర్వకంగా అభినందించింది. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రకళ వెంకటయ్య మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఈ ఘన విజయం మా సంస్థకు గర్వకారణం. భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించేందుకు ఇదే ప్రేరణగా నిలుస్తుంది" అని తెలిపారు. పాఠశాల విద్యార్థుల విజయంపై మహబూబ్‌నగర్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుశాంత్, కృష్ణ, పూజిత, మోహన్ రెడ్డి, శిరీష, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం

అప్పాపూర్ చెంచుపెంటలో

పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల రూరల్ క్యాంప్



అప్పాపూర్ చెంచుపెంటలో పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల రూరల్ క్యాంప్

**లింగాల,ఏప్రిల్ 29,ప్రభాతవార్త :** నాగరిక జీవనానికి దూరంగా నల్లమల అడవుల్లోని చెంచు పెంటల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసి గిరిజనుల జీవన విధానం తీసుకునేందుకు పాలమూరు యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థులు మండల పరిధిలోని నల్లమల అడవుల్లో గల అప్పాపూర్ చెంచుపెంటలో నిర్వహించిన మూడు రోజుల రూరల్ క్యాంపు బుధవారం ముగిసింది.డిపార్ట్మెంట్ విద్యసోషల్ వర్క్ డిపార్ట్మెంట్ ఆచార్యులు డా.ఎం. గాలేన్న, డా.ఆర్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎం ఎస్ డబ్ల్యూ మొదటి సంవత్సరానికి సంబంధించిన 40 మంది సోషల్ వర్క్ విద్యార్థులు 27 నుండి మొదలైన మూడు రోజుల రూరల్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పాపూర్ చెంచు పెంటలో జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీల జీవన విధానాలను అధ్యయనం చేశారు. విద్య, వైద్యం,మరుగుదొడ్లు,త్రాగు నీటి సౌకర్యం,రవాణా సౌకర్యం, పక్కా ఇండ్లు, పౌష్టికహారం, వారి ఆహారపు అలవాట్లు, అటవీ ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్,విద్యుత్ సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ ఆచార్యులు డా. ఎం.గాలేన్న, డా.ఆర్.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ సోషల్ వర్క్ డిపార్టుమెంట్ విద్యార్థులకు రూరల్ క్యాంపులో భాగంగా అప్పాపూర్ చెంచు పెంటను ఎంపిక చేసుకొనివిద్యార్థులకు వారి జీవన విధానాలను దగ్గరగా పరిశీలించేందుకు తీసుకురావడంజరిగిందని అన్నారు.విద్యార్థులు గ్రామస్థులకు వారి చెంచుపెంట నక్షను వేసి గుర్తించిన సమస్యలను ప్రజలకు తెలిపారు. విద్యార్థులు పరిశీలించిన అంశాలను,గుర్తించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు రూరల్ క్యాంపు దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు గడ్డం భరత్ బాబు,ఆంజనేయులు, రాకేష్, మహేష్, యాదగిరి, దత్తు, ఉదయ్, శివ, బుగ్గేష్, నవీన్, రమేష్,సాయి, పరుశ, అనిత, నర్మదా, రమణ, హర్షిత, వసంత, అఫ్రిన్,హేమలత, సునీత, గ్రామస్థులు పూజారి మల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మమ్మ, లీలాద్రి,లింగయ్య, గణేష్ పాల్గొన్నారు.

## స్టీమర్‌తో ఇసుక అక్రమ రవాణా..

- బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెక్ డ్యాం ధ్వంసం చేసి అధికార పార్టీపై నెట్టడం సరికాదు
- అధికారులు మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలి : దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి



మాట్లాడుతున్న మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి



ఇసుకను తరలిస్తున్న స్టీమర్

**దేవరకద్ర, ఏప్రిల్29 ప్రభాతవార్త:** స్టీమర్ల సహాయంతో అక్రమంగా ఇసుక తవ్వకం,రాత్రి వేళలో మాఫియా సభ్యులు యంత్రాల సహాయంతో ఇసుకను తవ్విహిటాచీల ద్వారా తరలిస్తున్నారు. బస్వాపూర్, రాకొండ శివారు మధ్యగల చెక్ డ్యాం ధ్వంసమని ఎవరైతే అసత్య ప్రచా రాలు చేస్తున్నారో వాళ్లే ధ్వంసం చేసి, అధికార పార్టీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేవరకద్ర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి బుధవారం దేవరకద్ర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.రాకొండ గ్రామానికి చెందిన పుల్లప్ప, పవన్‌కుమార్, మొగులయ్య, మరియు వారిమనుషులు గత సంవత్సరం నుండి రాకొండ, బస్వాపూర్,కుంట్ల, పెద్ద రాజమూర్ పరిసర ప్రాంతాలలో ఇసుక దోపిడీ చేస్తున్నారు. 12 లక్షలు పెట్టి ఒక స్టీమర్ను తీసుకొచ్చి దాని ద్వారా ఇసుక మాఫియా నడిపిస్తున్నాడు.ఆ స్టీమర్ చెక్ డ్యాంలో నీళ్ల ఉన్నప్ప టికీని నీటిలో ఇసుకను తీస్తుంది. ఆ తీసిన ఇసుకను టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కాకపోతే కొన్ని పెద్ద పెద్ద రాళ్లు స్టీమర్ యొక్క ఇసుకతోడే పైపులకు అడ్డు రావడంతో ఇసుక సరిగా రావడం లేదని భావించి చెక్ డ్యాంను ధ్వంసం చేస్తే డ్యామ్‌లో ఉన్న నీళ్లన్నీ దిగువకు వెళ్ళిపోతే అప్పుడు ఏకంగా హిటాచీని వాగులో దించి ఇసుకను తోడొచ్చన్న దురుద్దేశంతోనే చెక్‌డాం ధ్వంసంచేసే ప్రయత్నం చేసి ఇతరులపై నెడుతున్నాడని అన్నారు. గత మూడు నెలల కిందటే మైనింగ్ అధికారులు వచ్చి పుల్లప్పకు సంబంధించిన హిటాచిని వాగులో ఉండగా సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక తోడే క్రమంలో పరిసర ప్రాంత రైతులు ఎవరైనా అడ్డు చెబితే బెదిరిస్తున్నాడని ఆరోపించారు. పుల్లప్ప, వారి మనుషులు వారి పరిధి దాటి దేవరకద్ర పరిసర వాగులో కూడా ఇసుకను దోపిడి చేసి ఈ ప్రాంత రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అతనిపై పోలీస్ స్టేషన్లో, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని అంజిల్ రెడ్డి తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి, నిఘా పెంచి, మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవాలని మండల నాయకులు కోరారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఉషనప్ప , సాయి, రాఘవులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా చేయాలని,గత సంవత్సరం నీటి సమస్యలు ఎదుర్కొన్న గ్రామాలను గుర్తించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కొత్త బోర్ల అనుమతులు కేవలం అత్యవసర నీటి అవకాశమున్న ప్రాంతాలకు మాత్రమే ఇవ్వబడతాయని తెలిపారు.

**అధికారులకు షోకాజ్ నోటీసులు :** సమావేశంలో అన్ని మండల ప్రత్యేక అధికారులు హాజరయ్యారా అని కలెక్టర్ ప్రశ్నించారు.సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్‌నోటీసులు జారీకి ఆదేశించారు. మండలాల ప్రత్యేకఅధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన మండలాలను ప్రత్యక్షంగా సందర్శించి, మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలనికలెక్టర్ సూచించారు. ఎంపిడిఓలతో ఎంపిఓలతో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి, వేసవిలో నీటి కొరత ఎదుర్కొనే తండాలు, హాబిటేషన్లను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జడ్‌పిసిఈఓ ఇన్చార్జి డిపిఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, మిషన్ భగీరథఇంట్రా ఈఈ జయాబాయి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని అన్నారు. మెడికల్ కళాశాలలో ఐసీసీ ఏర్పాటు చేసి, లెక్చరర్లు, విద్యార్థులతో ప్రత్యేక టీమ్‌గా పనిచేస్తూ,మత్తు పదార్థాల వినియోగంపై సమాచారం అందిన వెంటనే గోప్యత పాటిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు.డ్రగ్స్ మొదట అలవాటుగా మొదలై, తరువాత ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీసే ప్రమాదం ఉందని, నర్వస్ సిస్టమ్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. యువత ఈ వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అలాగే బాల్య వివాహాల వల్ల బాలికలు తమ భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత తమ చుట్టూ జరిగే బాల్య వివాహాలను అడ్డుకొని, తల్లిదండ్రులను చైతన్యం చేయాలని సూచించారు. విద్య అంటే కేవలం ఉద్యోగం, డబ్బు సంపాదన మాత్రమే కాదని, సమాజాన్ని చైతన్య పరచే బాధ్యత కూడా యువతపై ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్ఎంఓ డా. రాఘవేందర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సునీత, శిరీష, షీటీమ్,భరోసా టీం, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల సాకారంతోనే గ్రామాలు మరింత అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఆదుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరూ సంతోషంగా బ్రతకాలి అనేదే నా ఉద్దేశం అని కొనియాడారు. అనుగొండ ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లో ప్లాట్ల విషయంలో మీ గ్రామ పెద్దలతో కలిసి చర్చించుకోవాలని సూచించారు. అప్పుడు భూములు కోల్పోయిన మీ కుటుంబ సభ్యుల పిల్లలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. స్మశాన వాటికలు కూడా ఏర్పాటు చేస్తూకొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామనీ అన్నారు. నీళ్ల ట్యాంకులు, నల్లాలతో సకల సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తూ అంకెన్ పల్లి, దాదన్ పల్లి లో కూడా త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే భూత్పూర్, నేరడుగాం గ్రామాలను కూడా ముంపు గ్రామాలు గా ప్రకటించి బాధితులను ఆదుకుంటామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు అనుగొండ గ్రామ సర్పంచ్ సుశీలమ్మ, మక్తల్ కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్ తదితరులు పాల్గొన్నారు. గోలపల్లి గ్రామ సర్పంచ్ సూర్యకుమార్, మంథన్ గోడ్ గ్రామ సర్పంచ్ రాజేందర్ గౌడ్ , మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, మార్కెట్ కమిటి చైర్మన్ రాధా లక్ష్మా రెడ్డి, చిట్యాల గ్రామ సర్పంచ్ రహమత్ పాషా, గజరం దొడ్డి సర్పంచ్ రాములు, మక్తల్ మార్కెట్ కమిటి చైర్మన్ రాధాలక్ష్మారెడ్డి,మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి ,కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణా రెడ్డి, మక్తల్, మాగనూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో సత్తా చాటిన జడ్పీహెచ్‌ఎస్ హరిజనవాడ విద్యార్థులు

**వనపర్తి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో జడ్పీహెచ్‌ఎస్,వనపర్తి పాఠశాల పదవ తరగతి విద్యార్థులు నజీర 566, మార్కులు, అబ్దుల్ ఆదిల్ 532, మార్కులు, భార్గవి 508 మార్కులు, భాను ప్రకాష్ 501, మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు.మొత్తం పదవ తరగతి విద్యార్థులలో 93 మంది విద్యార్థులుఉత్తీర్ణత సాధించారు.పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించినవిద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర్,ఎపిసిసి చైర్మన్ సునీత, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాఠశాల శ్రేయోభిలాషులు అభినందించారు.

## నర్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 100% ఉత్తీర్ణత

**నర్వ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో నర్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచిపాఠశాల పేరును నిలబెట్టారు. 2025,26 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల నుండి 71 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా,అందరూ ఉత్తీర్ణులై 100% శాతం ఫలితాలను సాధించడం ప్రభంజనం సృష్టించడం విశేషం. నర్వ పాఠశాల విద్యార్థిని కలాల్ పల్లవి 559/600 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. అలాగే కల్వల్ శిరీష 557 మార్కులతో ద్వితీయ స్థానంలో,గోడల ప్రసన్న 555 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ ఏడాది ఫలితాలలో నాణ్యతతో కూడిన ఉత్తీర్ణత లభించడం విశేషం. పాఠశాల నుండి పరీక్షలు రాసిన ప్రతి విద్యార్థి విజయం సాధించడమే కాకుండా, అత్యధిక మార్కులతో మెరిశారు. మొత్తం 71 మంది విద్యార్థులలో ముగ్గురు విద్యార్థులు 550 కంటే ఎక్కువ మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అంతేకాకుండా 32 మంది విద్యార్థులు 500 నుండి 550 మార్కుల శ్రేణిలో నిలిచి పాఠశాల సత్తాను చాటారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ,కష్టపడే తత్వం ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ వల్లేఈఅద్భుత విజయంసాధ్యమైందని కొనియాడారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను,వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను,ప్రత్యేక తరగతులునిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.

## టాప్ టెన్ వీరే..

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. 500 కు పైగా పదుల సంఖ్యలో విద్యార్థులు మార్కులు సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో టాప్ టెన్ ప్రభుత్వ, జడ్పీపి హైస్కూల్ విద్యార్థులు..1. ఆరాధ్య, 577 జడ్పిహెచ్‌ఎస్, పెద్దదిరాల 2. బి.నిక్షల, 572, జడ్పీపి బాలికలు హైస్కూల్ దేవరకద్ర 3. గౌతమీ 567, జెడ్పిపి హైస్కూల్, ఉడిత్యాల 4. శివలింగం, 565, జడ్పీపి హై స్కూల్, పెద్ద రేవల్లి 5. పి శ్రీకాంత్, 564, జడ్పీపి, తాటికొండ 6.మహేందర్ 561, జడ్పీపి హై స్కూల్, తాటికొండ 7. అందే శాన్వి,556 మార్కులు, మహబూబ్‌నగర్ ప్రభుత్వ బేసిక్ పాఠశాల8. ప్రణీత 558, జెడ్పిపి హైస్కూల్, ఎన్మన్ గండ్ల 9. శివాని 555, జడ్పిపి హై స్కూల్, తాటికొండ 10. పూజ 555 జడ్పీ పి వడ్డేమాన్.